

'ప్రాణహిత'కు దక్కని గౌరవం
తెలంగాణలో పుట్టి తెలంగాణలోనే అంతర్ధాన మయ్యే ప్రాణహిత నదికి ప్రత్యేక రాష్ట్రంలోనూ గుర్తింపు దక్కడం లేదు. పర్యాటక అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. 8లో▸



పునరుద్ధరణతో పునరుజ్జీవం
చెరువుల రక్షణకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూశాఖల సమన్వయంతో హద్దులు గుర్తిస్తోంది. అధికారులకు అవగాహన కల్పించారు. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
37.0 /29.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

గ్రూప్‌-1 అభ్యర్థులు 10గంటల్లోగా చేరుకోవాలి
మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల 9న జిల్లాలో జరిగే గ్రూప్‌–1 పరీక్షలకు అభ్యర్థులు ఉదయం 10గంటల్లో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ బి.సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 27 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, 9,384 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని, పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలను ఒక రోజు ముందుగా నిర్ధారించుకోవాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద మూడు కిలోమీటర్ల మేర 144 సెక్షన్ అమలు చేస్తామని, జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని తెలిపారు.

అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం
మంచిర్యాలఅర్బన్: పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో మొదటి రోజు ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్ష నిర్వహించారు. మొత్తం 334 మంది విద్యార్థులకు గాను 298 మంది హాజరయ్యారు. 36 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య సందర్శించారు. తొలిరోజు పరీక్షలు సజావుగా సాగినట్లు తెలిపారు.

గూడెం హుండీలు లెక్కింపు



హుండీ డబ్బులు లెక్కిస్తున్న సిబ్బంది

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయానికి మార్చి 26 నుంచి ఈ నెల 2వరకు(69 రోజులు) హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. రూ.5,89,486 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు. దేవాదాయశాఖ నిర్మల్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రంగు రవికిషన్‌గౌడ్ పర్యవేక్షణలో చేపట్టిన లెక్కింపులో ఆలయ అర్చకులు, సిబ్బంది, సత్యనారాయణ సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు



సీపీకి పరిస్థితిని వివరిస్తున్న నాయకులు

మంచిర్యాలక్రైం: బీఆర్‌ఎస్ కార్యకర్తలపై దాడులు, అక్రమ కేసులను నిరసిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, పెద్దపల్లి పార్లమెంటు అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, నాయకులు సోమవారం రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ కలిశారు. రామగుండం కమిషనరేట్ కార్యాలయంలోని చాంబర్‌లో ఆయనను కలిసి ఇటీవల మంచిర్యాలలో గడప రాకేష్‌పై దాడికి పాల్పడిన కాంగ్రెస్ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దాడికి పాల్పడిన, బాధ్యులైన వారిని అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, నాయకులు పాల్గొన్నారు.

ఆశాలకు పరీక్ష ఉపసంహరించుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మంచిర్యాలటౌన్: ఆశావర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం పరీక్ష నిర్వహణను ఉపసంహరించుకోవాలని ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం సూపరింటెండెంట్ విశ్వేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సమ్మక్క మాట్లాడుతూ పేద, గ్రామీణ ప్రాంత ప్రజలు, గర్భిణులకు కొన్నేళ్లుగా సేవలు అందిస్తున్నామని, ప్రభుత్వం తమను గుర్తించడం లేదని పేర్కొన్నారు. గత 20 ఏళ్లుగా పనిచేస్తున్న ఆశావర్కర్లకు ఇప్పుడు పరీక్ష నిర్వహిస్తే రాసే పరిస్థితుల్లో ఉండరని తెలిపారు. ప్రభుత్వం పునరాలోచించి సమస్యలు పరిష్కరించాలని, రూ.18 వేల వేతనం, సంక్షేమ పథకాలు అందించాలని తెలిపారు. కార్యదర్శి శోభ, జిల్లా కమిటీ సభ్యులు విజయలక్ష్మి, పద్మ, విజయ, కవిత, కృష్ణవేణి పాల్గొన్నారు.



కౌంటింగ్ కేంద్రంలో టేబుళ్లు

నేడే ఫలితం

- లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఆసక్తి
- పటిష్ట భద్రత మధ్య ఓట్ల లెక్కింపు
- విజయోత్సవ ర్యాలీలపై నిషేధం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: లోక్‌సభ ఎన్నికల ఫలితం మరికొద్ది గంటల్లో వెలువడనుంది. గత నెల 13న పోలింగ్ నిర్వహించగా.. మంగళవారం మధ్యాహ్నం వరకు గెలుపెవరిదో వెల్లడి కానుంది. పోలింగ్ జరిగిన నాటి నుంచి 22రోజులుగా ఎవరు గెలుస్తారో.. ఎవరు ఓడుతారోననే ఆసక్తి సర్వత్రా నెలకొంది. ఈ క్రమంలో పోటీ చేసిన అభ్యర్థులు, పార్టీ నాయకులు నిద్రలేని రాత్రుళ్లు గడుపుతున్నారు. గతంలో కంటే ఈసారి హోరాహోరీగా ఎన్నికలు సాగడంతో అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్, స్వతంత్ర అభ్యర్థులు కలిపి 42మంది పోటీలో ఉన్నారు. ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల మధ్య పోటీ నెలకొంది. వీటిలో రెండు జాతీయ పార్టీల మధ్య గెలుపోటములు ఉంటాయనేది ఇప్పటికే సర్వేలు, ఎగ్జిట్ పోల్ అంచనాలు వచ్చాయి. ఈ క్రమంలో ఢిల్లీకి వెళ్లే ప్రజాప్రతినిధి ఎవరనేది తేలిపోనుంది.

పకడ్బందీగా లెక్కింపు

పెద్దపల్లి జిల్లా పరిధి పెద్దపల్లి, ధర్మపురి, రామగుండం, మంథని అసెంబ్లీ సెగ్మెంట్ల లెక్కింపు రామగిరి మండలం సెంటినరీ కాలనీలోని జేఎన్‌టీయూలో జరగనుంది. మంచిర్యాల జిల్లా పరిధి బెల్లంపల్లి, చెన్నూర్, మంచిర్యాల సెగ్మెంట్ల ఓట్ల లెక్కింపు హాజీపూర్ మండలం ముల్కల్ల ఐజా ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహిస్తారు. ఆదిలాబాద్ ఎంపీ పరిధి ఖానాపూర్ నియోజకవర్గ జన్నారం మండలం ఓట్లు ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో లెక్కిస్తారు. ఉదయం 6గంటల నుంచే ప్రక్రియ ప్రారంభం కానుంది. 6.30గంటలకే ఈవీఎంలను తెరిచి ఏజెంట్లకు చూపించినప్పటి నుంచి మొదలు వీవీప్యాట్‌లో ఓటరు స్లిప్పులు లెక్కిస్తారు. సెగ్మెంట్‌కు ఓ హాల్ ఏర్పాటు చేశారు. ప్రతీ అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఐదు చొప్పున పోలింగ్ కేంద్రాల స్లిప్పులు లాటరీ పద్ధతిన తీసి లెక్కిస్తారు. ఇక పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఆర్వో పరిధిలో ఆదిలాబాద్, పెద్దపల్లిలోనే లెక్కిస్తారు. రౌండ్ల వారీగా కంట్రోల్ యూనిట్ల మీట నొక్కుతూ ఓట్లు లెక్కించనున్నారు. ప్రతీ టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్‌తోపాటు అదనంగా మరో ఐదుగురు చొప్పున సిబ్బంది ఉంటారు. జిల్లా ఎన్నికల అధికారి, కేంద్ర ఎన్నికల అధికారి సమక్షంలో నిర్ధారించుకుంటూ ఫలితాలు వెల్లడిస్తుంటారు. కౌంటింగ్ కేంద్రాలకు ఒక కిలోమీటర్ వరకు ఆంక్షలు విధించారు. 144సెక్షన్ అమలుతోపాటు విజయోత్సవ ర్యాలీలకు అనుమతి ఇవ్వడం లేదు. కౌంటింగ్ సెంటర్ వద్ద ఐదురుగు ఏసీపీలు, 14మంది సీఐలు, 40మంది ఎస్సైలు, 112మంది ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 96మంది కానిస్టేబుళ్లు, 21మంది ఉమెన్ హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు 80మందితో కలిపి మొత్తం 368మంది, వీరికి అదనంగా మూడు స్పెషల్ పార్టీలు, కేంద్ర ప్లటూన్ బలగాల బందోబస్తు మధ్య ఓట్ల లెక్కింపు జరగనుంది.



ఆర్వోల కోసం ఏర్పాటు చేసిన టేబుల్



అభ్యర్థులు, ఏజెంట్ల కోసం ఏర్పాటు చేసిన కుర్చీలు

ఓట్ల లెక్కింపు వివరాలు

నియోజకవర్గం	పోలింగ్‌కేంద్రాలు	టేబుళ్లు	రౌండ్లు	సిబ్బంది
చెన్నూరు(ఎస్సీ)	227	14	16	81
బెల్లంపల్లి(ఎస్సీ)	227	14	16	81
మంచిర్యాల	287	14	21	81
ధర్మపురి(ఎస్సీ)	269	14	19	81
రామగుండం	260	14	19	81
మంథని	290	14	21	81
పెద్దపల్లి	290	14	21	81
మొత్తం	1850	98	133	567

పోస్టల్‌బ్యాలెట్ ఓట్లు 12897, టేబుళ్లు 26, సిబ్బంది 154

పోలైన ఓట్లు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా

నియోజకవర్గం	మొత్తంఓట్లు	పోలైనవి	శాతం
చెన్నూర్	1,93,778	1,32,787	68.53
బెల్లంపల్లి	1,76,514	1,25,255	70.96
మంచిర్యాల	2,78,738	1,69,591	60.84
ధర్మపురి	2,30,786	1,69,258	73.34
రామగుండం	2,19,723	1,35,330	61.59
మంథని	2,39,699	1,67,750	69.98
పెద్దపల్లి	2,57,192	1,83,482	71.34
మొత్తం	15,96,430	10,83,453	67.87

పోటీ చేసిన అభ్యర్థులు 42మంది. నోటా అదనం

మెజార్టీ వస్తదా?

- గెలుస్తామా? ఓడుతామా?
- ఎగ్జిట్ పోల్స్‌తో అభ్యర్థుల్లో టెన్షన్
- నేటి మధ్యాహ్నం వరకు స్పష్టత



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: హోరాహోరీగా సాగిన పెద్దపల్లి లోక్‌సభ ఎన్నికల్లో గెలుపుపై ఉత్కంఠ కొనసాగుతోంది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరిగిన ఈ ఎన్నికల్లో గెలుపు ఇటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు, ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌కు, అటు కేంద్రంలోని బీజేపీకి ప్రతిష్టాత్మకంగా మారింది. బరిలో ఉన్న అభ్యర్థుల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ మధ్య ప్రధాన పోటీ నెలకొంది. తమ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించేందుకు జిల్లా పరిధిలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చెమటోడ్చారు. కేంద్రంలోని ప్రధాని మోదీ చరిష్మా, కేంద్ర ప్రభుత్వ పథకాలు, విధానాలు ప్రచారం చేస్తూ గోమాసే శ్రీనివాస్‌ను గెలిపించాలని బీజేపీ నాయకులు కోరారు. బీఆర్‌ఎస్ నుంచి పోటీలో ఉన్న సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌నే గెలిపించాలని గులాబీ నేతలు ప్రచారం చేశారు. మాజీ సీఎం కేసీఆర్‌తో సహా పలువురు నాయకులు జిల్లాకు వచ్చి తమ అభ్యర్థుల కోసం ప్రచారం నిర్వహించారు. జిల్లా ఓటర్లు ఎటు వైపు మొగ్గు చూపారనేది ఆసక్తికరంగా మారింది. జిల్లా కేంద్రం, కోల్‌బెల్ట్, బెల్లంపల్లి, చెన్నూర్ గ్రామీణ ప్రాంతాల్లో జరిగిన ఓటింగ్ గెలుపోటములపై ప్రభావం చూపనుంది. ఈ క్రమంలో ఏడు సెగ్మెంట్లలో జిల్లా ఓట్లే ఎంపీగా గెలిపించడంలో కీలకంగా మారాయి. మరోవైపు ఎగ్జిట్ పోల్స్ రెండు జాతీయ పార్టీల వైపు మొగ్గు చూపడంతో అభ్యర్థుల్లో టెన్షన్ నెలకొంది.

గెలుపుపై విశ్వాసం

అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటిన హస్తం పార్టీ నాయకులు పెద్దపల్లి స్థానం కైవసం చేసుకుంటామనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. లక్షకు పైగా మెజార్టీ వస్తుందని పదే పదే చెబుతున్నారు. ఈ క్రమంలో ఏ పోలింగ్ బూత్ నుంచి ఎన్ని ఓట్లు పడ్డాయో ఈవీఎంల మీట నొక్కగానే తేలిపోనుంది. ఇక బీజేపీకి ఈసారి గణనీయమైన ఓట్లు పడ్డాయనే ఆశతో కమలనాథులు ఉన్నారు. ఈ ఎన్నికల్లో రహస్య ఓట్లతో బయటపడుతామని చెబుతున్నారు. గతంలో కంటే మెరుగైన ఓట్లు పడ్డాయని అంటున్నారు. పట్టణ ప్రాంతాలు, యువతతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఓటు బ్యాంకు పెరిగిందని నమ్మకంతో ఉన్నారు. కాంగ్రెస్, బీజేపీ మధ్య పోటీ జరిగిందని చెబుతున్నారు. ఇటీవల ఎగ్జిట్ పోల్స్‌నూ ఇవే అంచనాలు వెల్లడించాయని అంటున్నారు. మరోవైపు గులాబీ పార్టీ నాయకులు సైతం విజయం సాధిస్తామనే నమ్మకంతో ఉన్నారు. ఈ ముగ్గురిలో ఎవరు గెలుస్తారు? ఎంత మెజార్టీ సాధిస్తారు? ప్రజా మద్దతు ఎటువైపు ఉన్నదనే ఉత్కంఠకు మరికొద్ది గంటల్లోనే తెరపడనుంది.

కౌంటింగ్‌పై అప్రమత్తం

కౌంటింగ్ వేళ అప్రమత్తంగా ఉండాలని పార్టీ ఆదేశాల మేరకు అభ్యర్థులు తమ అనుచరులు, ప్రధాన నాయకులతో సమావేశాలు నిర్వహించారు. ఏజెంట్లతో నాయకులు ప్రతీది గమనించాలని సూచించారు. ఏదైనా సమస్య తలెత్తినా ఓట్ల లెక్కింపులో ప్రత్యర్థుల తీరుపై సందేహాలు ఉన్నా తమ దృష్టికి తేవాలని సూచించారు. ఉదయమే అందరూ సిద్ధంగా ఉండాలని కోరారు. యువకులు, ఉత్సాహంగా ఉన్న వారినే ఏజెంట్లుగా ఎంపిక చేసి ఆ మేరకు వారిని సన్నద్ధం చేశారు. లెక్కింపులో చివరి రౌండ్ గెలుపోటములు స్పష్టత వచ్చేవరకు జాగ్రత్తగా ఉండాలని ఆదేశాలు వెళ్లాయి.

పకడ్బందీగా ఓట్ల లెక్కింపు



మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్, పర్యవేక్షకురాలు విజయరవికుమార్

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం హాజీపూర్ మండలం ముల్కల్లలోని ఐజా కళాశాల లెక్కింపు కేంద్రంలో లెక్కింపు పర్యవేక్షకురాలు విజయరవికుమార్‌తో కలిసి సూక్ష్మ పరిశీలకుల రెండో విడత శిక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సంఘ నిబంధనలకు లోబడి విధుల్లో బాధ్యతగా ఉండాలని తెలిపారు. లెక్కింపు ప్రారంభమైన వెంటనే కంట్రోల్ యూనిట్‌లో పోలైన ఓట్లు సరి చూసుకోవాలని, సరిగా లేనిపక్షంలో సహాయ రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకురావాలని సూచించారు. కౌంటింగ్ ఏజెంట్లు లేవనెత్తిన అనుమానాలను నివృత్తి చేయాలన్నారు. అదనపు కలెక్టర్ మోతీలాల్, డీసీపీ అశోక్‌కుమార్, ఏసీపీ ప్రకాశ్, బెల్లంపల్లి ఏఆర్‌ఓ, అదనపు కలెక్టర్ రాహుల్, ఎస్డీసీ, చెన్నూర్ ఏఆర్‌ఓ చంద్రకళ, ఆర్డీఓ, మంచిర్యాల ఏఆర్‌ఓ రాములు, లెక్కింపు పరిశీలకులు, సహాయకులు, సూక్ష్మ పరిశీలకులు పాల్గొన్నారు.



పాల్గొన్న ఎన్నికల లెక్కింపు సిబ్బంది

రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి

మంచిర్యాలఅగ్రికల్చర్: ఓట్ల లెక్కింపునకు అవసరమైన పోలింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు కలెక్టర్ బి.సంతోష్ తెలిపారు. సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో కౌంటింగ్ పరిశీలకులు విజయరవికుమార్ సమక్షంలో బెల్లంపల్లి, చెన్నూర్, మంచిర్యాల రిటర్నింగ్ అధికారులు, జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్, మోతీలాల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, రాములతో కలిసి కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియలో భాగంగా ప్రతీ నియోజకవర్గానికి 14 సాధారణ టేబుళ్లు, 1 పరిశీలకుల టేబుల్ ఏర్పాటు చేశామని, ప్రతీ టేబుల్‌కు ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఒక కౌంటింగ్ అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారని, అదనపు సిబ్బందితో కలిపి ప్రతీ నియోజకవర్గానికి 18 మంది కౌంటింగ్ సహాయకులు, 18 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించామని వివరించారు. డీఈవో యాదయ్య, లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ తిరుపతి, ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో పిన్న రాజేశ్వర్, ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మూడంచెల భద్రత



లెక్కింపు కేంద్రంలో భద్రత ఏర్పాట్లు సమీక్షిస్తున్న సీపీ శ్రీనివాసులు, పోలీస్ అధికారులు

- ర్యాలీలు, టపాసులు పేల్చుడు బంద్
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- రామగుండం సీపీ శ్రీనివాసులు
- బందోబస్తు సిబ్బందికి సూచనలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/మంచిర్యాలక్రైం: ఓట్ల లెక్కింపునకు ముల్కల్లలోని ఐజా ఇంజినీరింగ్ కళాశాలలో భద్రత ఏర్పాట్లు పూర్తి చేశామని, ఫలితాల వెల్లడి అనంతరం అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా ఉండేందుకు 369మంది పోలీసు బలగాలతో మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని రామగుండం పోలీసు కమిషనర్ ఎం.శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఆయన హాజీపూర్ మండలం ముల్కల్ల ఐజా కళాశాలలోని లెక్కింపు కేంద్రం భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్ట్రాంగ్ రూముల భద్రత, కంట్రోల్‌రూంలో సీసీ కెమెరాల పనితీరు పరిశీలించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. లెక్కింపు పూర్తయ్యే వరకు విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మంగళవారం ఉదయం 6గంటల నుంచి బుధవారం ఉదయం 6గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. కౌంటింగ్ కేంద్రానికి వంద మీటర్ల దూరం వరకు ఐదుగురి కంటే ఎక్కువ మంది గుంపులుగా ఉండకూడదని అన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద మూడు ప్రత్యేక కేంద్ర బలగాలు, రహదారులపై మరో వంద మంది సివిల్ పోలీసులు భద్రత విధులు నిర్వర్తిస్తారని పేర్కొన్నారు. ర్యాలీలు, టపాసులు పేల్చడం నిషేధించామని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డును భద్రత సిబ్బందికి చూపించిన వారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ అశోక్‌కుమార్, ఏసీపీలు ప్రకాశ్, వెంకటేశ్, రవికుమార్, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్ర, మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, ట్రాఫిక్ సీఐ నరేశ్, హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షను నెరవేర్చాం
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్



జెండా ఆవిష్కరిస్తున్న బాల్క సుమన్

శ్రీరాంపూర్: తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన పార్టీ బీఆర్‌ఎస్ అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ ముగింపు వేడుకల్లో భాగంగా సోమవారం నస్పూర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన జాతీయ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్లాది మంది తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ సాధించారని అన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో తెలంగాణ రాష్ట్రాన్ని సువర్ణమయం చేశామని, దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రగతిని వివరించే డాక్యుమెంటరీని తెలంగాణ భవన్‌లో ప్రదర్శించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పెద్దపల్లి పార్లమెంటు అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు, నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, నల్మాస్ కాంతయ్య, రాజారమేశ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అక్కురి సుబ్బయ్య, నాయకులు పెట్టం లక్ష్మణ్, మేరుగు పవన్‌కుమార్, కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

'ఉమర్‌మియా' భూములపై విచారణ జరపాలి



మాట్లాడుతున్న కౌన్సిలర్ ఎండి.మిన్హాజొద్దీన్

మంచిర్యాలటౌన్: ఉమర్‌మియా సొసైటీ భూములపై కలెక్టర్, ఆర్డీవో సమగ్ర విచారణ చేయాలని 25వ వార్డు కౌన్సిలర్ ఎండీ.మిన్హాజొద్దీన్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని చున్నంబట్టి వాడ వంద ఫీట్ల రోడ్డులో గల ఉమర్‌మియా సొసైటీ భూమిలో సోమవారం సొసైటీలో ప్లాట్లు కొనుగోలు చేసిన కొందరు భూయజమానులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఉమర్‌మియా సొసైటీ కార్యనిర్వాహక వర్గం 2016లోనే రద్దయిందని, స్పెషల్ ఆఫీసర్ జిల్లా కోఆపరేటివ్ ఆధీనంలో ఉందని, కానీ కొందరు సొసైటీ కార్యనిర్వాహక వర్గం పేరిట విలేకర్ల సమావేశంను ఏర్పాటు చేసి ప్రజలకు అవాస్తవాలు తెలిపారని అన్నారు. హైకోర్టులో ఉన్న కేసు విషయమై 17 మందికి కోర్టు ద్వారా ఇంటి అనుమతులను చట్టప్రకారంగా పరిశీలించాలని తెలిపారని, సర్వే నంబర్లు 474, 476 గర్మిళ్ల శివారు మంచిర్యాలలోని టైటిల్ డాక్యుమెంట్లు కలిగి ఉన్న వ్యక్తుల ఆక్షేపణలు, అనుమతులు జారీకంటే ముందే సమగ్ర విచారణ జరిపించాలని హైకోర్టు ఆదేశించిందని తెలిపారు. సొసైటీ చెబుతున్నట్లుగా ప్రభుత్వం నుంచి ఎటువంటి సేల్‌డీడ్‌లు లేవని, సొసైటీ సభ్యుల ప్రలోభాలకు ప్రజలు మోసపోవద్దని, అధికారులు ఇంటి అనుమతులు, నల్లా కనెక్షన్లు ఇవ్వవద్దని, బ్యాంకులు రుణాలు మంజూరు చేయవద్దని కోరారు. ఈ సమావేశంలో సుబ్బారావు, బిస్మిల్లా బి, రత్నం తిరుపతిరెడ్డి, సాధిక్, కొండబత్తిని కిషన్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి

జన్నారం: జిల్లాలో నాణ్యమైన విద్యుత్ నిరంతర సరఫరాకు సిబ్బంది కృషి చేస్తున్నారని జిల్లా ఎస్‌ఈ శ్రావణ్‌కుమార్ అన్నారు. ఇటీవల వరుస విద్యుత్ కోతలపై జన్నారం మండలానికి చెందిన కొందరు కాంగ్రెస్ నాయకులు విద్యుత్ సీఎండీకి ఫిర్యాదు చేయగా, ఆయన సూచన మేరకు సోమవారం జన్నారంలో ఎస్‌ఈ విచారణ జరిపారు. కాంగ్రెస్ నాయకులతో సమావేశమై సమస్యలు తెలుసుకున్నారు. విద్యుత్ సిబ్బంది కొందరు ఏఈతో సహా స్థానికంగా ఉండకపోవడం వల్ల సమస్యపై పట్టింపులేనట్లు కనిపిస్తోందని, చీటికి మాటికి విద్యుత్ కట్ చేస్తున్నారని, గంటల కొద్దీ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని ఎస్‌ఈ దృష్టికి తీసుకెళ్లారు. ఎస్‌ఈ స్పందిస్తూ.. పని చేయని విద్యుత్ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఏఈతో సహా లైన్ ఇన్‌స్పెక్టర్లు స్థానికంగా ఉండాలని, లేనిపక్షంలో శాఖపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇటీవల గాలులకు చెట్లు తగిలి, గాలితో కూడిన వర్షానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని, అనవసరంగా విద్యుత్ కోతలు లేవని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు సుభాష్‌రెడ్డి, మల్యాల బాపన్న, ముత్యం రాజన్న, సుధీర్‌కుమార్, బీజేపీ అధ్యక్షుడు మధుసూదన్‌రావు, కార్యదర్శి కొంతం శంకరయ్య, విద్యుత్ ఏడీ ప్రభాకర్‌రావు, ఏఈ లచ్చన్న, సబ్ ఇంజినీర్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ నాయకులతో మాట్లాడుతున్న ఎస్‌ఈ

క్లుప్తంగా

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం


దగ్ధమైన ఇల్లు, సామగ్రి

కోటపల్లి: మండలంలోని పిన్నారంలో ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన ఆత్రం చంటక్క అనే నిరుపేద మహిళ ఆదివారం రాత్రి ఇంటి ముందు కుటుంబ సభ్యులతో కలిసి నిద్రించింది. తెల్లవారుజామున ఇంట్లోనుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో స్థానికులు వచ్చి మంటలు ఆర్పివేసినా అప్పటికే ఇంట్లోని సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. గ్రామస్తులు తహసీల్దార్ మహేంద్రనాథ్‌కు సమాచారం అందించగా ఆర్‌ఐ రాజలింగు పంచనామా నిర్వహించి రూ.50 వేల వరకు నష్టం జరిగి ఉంటుందని అంచనా వేశారు. అనంతరం ఆర్‌ఐ బాధితురాలు చంటక్కకు 25 కిలోల బియ్యం అందించారు.

అనుమానాస్పదంగా యువకుడు మృతి


శ్యాంసుందర్ (ఫైల్)

మందమర్రిరూరల్: పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన మదిరె శ్యాంసుందర్ (30) అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. సోమవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి వాష్‌రూంలోకి వెళ్లిన శ్యాంసుందర్ ఎంతకూ బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు డోర్ తొలగించి చూడగా అపస్మారక స్థితిలో పడిఉన్నాడు. వెంటనే 108కు సమాచారం అందించగా పరిశీలించిన వైద్యసిబ్బంది అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తామని ఎస్సై తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతి చెందిన వ్యక్తి (ఫైల్)

మంచిర్యాలక్రైం: స్థానిక రైల్వేస్టేషన్లో సోమవారం ప్రమాదవశాత్తు రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి (40) మృతి చెందినట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మృతుడు కొద్ది రోజులుగా రైలు పట్టాలపై పడి ఉన్న ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లు ఏరుకుంటూ ఉండేవాడు. సోమవారం రైలు పట్టాలపై బాటిళ్లు ఏరుకుని ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగా బెంగళూర్ నుంచి పాట్నావైపు వెళ్తున్న సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీ గదిలో భద్రపర్చినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. వివరాలకు 8712658596, 8712658605 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

‘ప్రాణహిత’కు దక్కని గౌరవం

- పుష్కర నదిగా పురాణ ప్రాశస్త్యం
- తెలంగాణలో పుట్టి తెలంగాణలోనే అంతర్ధానం
- జీవనదిని పట్టించుకోని పాలకులు
- ప్రత్యేక రాష్ట్రంలోనూ దక్కని గుర్తింపు
- పర్యాటకంగా అవకాశాలు కల్పించాలని డిమాండ్


ప్రాణహిత నది


ప్రాణహితకు హారతి ఇస్తున్న స్థానికులు (ఫైల్)


పుష్కరాల్లో ప్రాణహితకు ఇచ్చిన సారె (ఫైల్)

చింతలమానెపల్లి: అందమైన పరిసరాలు.. ప్రతీ కాలంలోనూ ప్రవహించే నీరు..ఆహ్లాదం అందించే అటవీ ప్రాంతం.. పురాణాల్లో ప్రశస్తి గాంచి పుష్కర నదిగా పేరు పొందిన నది.. వర్షాకాలంలో ఉగ్ర రూపం దాల్చినా అబ్బురపరిచేలా కనిపించే నది.. ప్రాణులకు నెలవుగా పేరు గాంచిన ‘ప్రాణహిత’కు తగిన గౌరవం లభించకపోగా పాలకుల నిర్లక్ష్యానికి గురవుతోంది.

తెలంగాణలో పుట్టి తెలంగాణలోనే ముగింపు

ప్రాణహితకు తెలంగాణలో ఒక ప్రత్యేకత ఉంది. ఈ నది తెలంగాణలోనే పుట్టి తెలంగాణలోనే ముగుస్తుంది. కుమురంభీం జిల్లాలోని కౌటాల మండలం తుమ్మిడిహేటి వద్ద ఈనది జన్మస్థలం. వార్ధా (పెన్‌గంగ), వైనగంగ నదుల సంగమంతో ఈనది జన్మించింది. కుమురంభీం జిల్లా నుంచి మంచిర్యాల జిల్లా మీదుగా కరీంనగర్ జిల్లా సరిహద్దులోని కాళేశ్వరం వద్ద గోదావరితో సంగమిస్తుంది. తెలంగాణలోని కుమురంభీం, మంచిర్యాల, మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలకు సరిహద్దుగా ఉంది. 113 కిలోమీటర్ల దూరంప్రయాణించే ఈనది గోదావరినది జలాలలో 40 శాతం వాటాను కలిగి ఉంది.

పురాణ ప్రాశస్త్యం కలిగిన పుష్కర నది

ప్రాణహిత నది ప్రస్తావన పురాణాలలో ఉంది. ప్రణీత మహాముని పేరు మీదుగా ఈనదికి ప్రాణహిత పేరు వచ్చింది. హైందవ ధర్మం ప్రకారం పుష్కరాలు నిర్వహించే 12 నదుల్లో ప్రాణహిత 12వ నది. పేరుకు తగినట్లుగా ఈనదీ తీరం జీవవైవిధ్యం కలిగి ఉంటుంది. మహారాష్ట్ర, తెలంగాణలోని ఇరు ప్రాంతాల్లో దట్టమైన అటవీప్రాంతాన్ని కలిగి ఉంది. ఈనదీ తీరంలోనే మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలంలో అరుదైన వృక్ష శిలాజాలు, డైనోసార్ అవశేషాలు లభించాయి. పలు రకాల ప్రాణులకు నిలయంగా ఉంది. తుమ్మిడిహేటి వద్ద చపరాడ ప్రశాంతధాం ఆలయం మొదలు కాళేశ్వరం వరకు పలు ప్రసిద్ధి చెందిన దేవాలయాలు ఉన్నాయి. పురాణాల్లో ప్రశస్తి కలిగిన ప్రకారం ఈ నదికి పన్నెండేళ్లకు ఒకసారి పుష్కరాలు వస్తాయి. 2010లో మొదటిసారి, ఆతర్వాత 2022 ఏప్రిల్‌లో పుష్కరాలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి నదిలో మొక్కులు చెల్లించుకున్నారు.

ఆదరణకు నోచుకోని వైనం

ప్రాణహిత నది తెలంగాణలో పుట్టి తెలంగాణలోనే తన ప్రస్థానాన్ని ముగిస్తుంది. ఈ నదికి ప్రత్యేక గుర్తింపు ఇవ్వాల్సి ఉండగా పాలకుల నిర్లక్ష్యంతో ఆదరణకు నోచుకోవడం లేదు. తెలంగాణ కవులు, గేయకారుల ఆలోచనల్లో గోదావరి, కృష్ణా నదులే తప్పా ప్రాణహిత ప్రస్తావన కనిపించదు. గత ప్రభుత్వ హయాంలో 2022లో పుష్కరాలు నిర్వహించేందుకు ప్రభుత్వం ముందుకు రాలేదు. నామమాత్రంగా ఏర్పాట్లు చేసి చేతులు దులుపుకున్నారు. కుమురంభీం జిల్లా తుమ్మిడిహేటి, మంచిర్యాల జిల్లాలోని అర్జునగుట్ట వద్ద ఏర్పాట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రాణహిత నీటిని కాళేశ్వరం వద్ద ప్రాజెక్టు నిర్మించి పలు జిల్లాలకు తరలిస్తున్నా అప్పటి ప్రభుత్వం పుష్కరాల్లో నిధులు కేటాయించక పోవడంతో విమర్శలు వెల్లువెత్తాయి. గోదావరి, కృష్ణా నదుల పుష్కరాలకు కోట్ల రూపాయలు కేటాయిస్తున్న ప్రభుత్వాలు ప్రాణహితపై చిన్నచూపు చూపడం వివక్షేనని ప్రజలు ఆరోపిస్తున్నారు. జీవనదిగా పేరుగాంచిన ప్రాణహిత నదిని ఎన్నికల అంశంగా మారుస్తూ ప్రాణహిత జీవం తీస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

పర్యాటక గుర్తింపు ఇవ్వాలి

ప్రాణహితకు తగిన గౌరవం కల్పించడంతోపాటు పర్యాటక గుర్తింపు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. తుమ్మిడిహేటి వద్ద ప్రాణహిత మాత విగ్రహాన్ని ఏర్పాటు, పర్యాటకులకు వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. నది పరీవాహకంలోని గిరిజన, వెనుకబడిన ప్రాంతాల్లో పర్యాటక స్థలాలను గుర్తించి స్థానికులకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలి. కుమురంభీం, మంచిర్యాల జిల్లాలలో పర్యాటకులు సందర్శించేలా ప్రచారం నిర్వహించాలి. ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనైనా ప్రాణహిత నదికి తగిన గౌరవం, గుర్తింపు లభిస్తుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అసెంబ్లీలో ప్రస్తావిస్తా..



ప్రాణహిత నదికి తగిన గౌరవం లభించాల్సి ఉంది. నది తీర ప్రాంతాల్లో గిరిజన, ఆర్థికంగా వెనుకబడిన ప్రజలే ఎక్కువగా ఉన్నారు. సాగునీటి అవసరాలు తీర్చి ఆర్థిక వృద్ధికి ప్రస్తుత ప్రభుత్వం కృషి చేయాలి. నది తీరంలో ప్రాణహిత మాత విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తా. పర్యాటకంగా గుర్తింపునకు అసెంబ్లీలో ప్రస్తావిస్తా. – పాల్వాయి హరీష్‌బాబు, ఎమ్మెల్యే, సిర్పూర్(టి)

‘హామీల అమలుకు కృషి’

శ్రీరాంపూర్: సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తున్నామని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. సోమవారం ఆర్కే 7 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. పది నెలలుగా పెండింగ్‌లో ఉన్న సీఎంపీఎఫ్ లోన్ సమస్య పరిష్కరించామన్నారు. సొంతింటి పథకం, ఇంకా ఇతర హక్కుల సాధన కోసం తాము పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, ఏరియా కార్యదర్శి మారుపెల్లి సారయ్య, పిట్ సెక్రెటరీ బీర రవీందర్, నాయకులు మురళి చౌదరి, ఆకుల లక్ష్మణ్, రాంచందర్, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

‘హర్కర’ను కలిసిన ఉమ్మడి జిల్లా నాయకులు


పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

దండేపల్లి: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, కాంగ్రెస్ పార్టీ ప్రొటోకాల్ చైర్మన్ హర్కర వేణుగోపాల్‌ను తెలంగాణ ఎల్‌పీజీ గ్యాస్ డిస్ట్రిబ్యూటరీ అసోసియేషన్ ఈసీ సభ్యులు సోమవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయనను కలిసిన వారిలో ఉమ్మడి ఆదిలాబాద్‌కు చెందిన వెంగళరావ్, సత్యనారాయణగౌడ్, సుభాష్‌రావు, తదితరులు ఉన్నారు.

‘కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలి’


చర్చలు జరుపుతున్న అధికారులు

కాసిపేట: దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీలో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కంపెనీ గేట్ ఎదుట మృతదేహం ఉంచి నిరసన తెలిపారు. తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం... కంపెనీలోని వర్క్‌షాపులో పర్మినెంట్ ఎంప్లాయిగా పనిచేస్తున్న మేకల రాకేష్ (48) గత నెల 28న విధులకు వెళ్తుండగా కంపెనీ ఆవరణలో కాంప్రెషర్ హౌజ్ సమీపంలోని థర్డ్‌ప్లాంట్ మార్గంలో కోతులు దాడి చేశాయి. తప్పించుకునే ప్రయత్నంలో హ్యాండ్‌రేల్ ఫెడస్టాల్ మీద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. ముందుగా కంపెనీ డిస్పెన్సరీలో ప్రథమ చికిత్స చేయించి అక్కడి నుంచి మంచిర్యాలకు, వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని సోమవారం కంపెనీ గేట్ ఎదుట ఆందోళన చేపట్టడంతో విషయం తెలుసుకున్న దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు అక్కడికి వెళ్లి వారికి నచ్చజెప్పినా వినకపోవడంతో కంపెనీ అధికారులతో చర్చలు జరిపారు. అన్ని బెనిఫిట్స్‌తో పాటు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు అంగీకరించడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, యూనియన్ నాయకులు తిరుపతిరెడ్డి , స్థానిక నాయకులు మెరుగు శంకర్, రమణ, ఆడె జంగు, వడ్లూరి మల్లేశ్, షాకీర్, తదితరులు పాల్గొన్నారు.

‘ప్రాణహిత’లో మునిగి ఒకరి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రాజు

దహెగాం: మండలంలోని రావులపల్లి గ్రామానికి చెందిన కుడ్మెత గోవిందరావు (45) ప్రమాదవశాత్తు ప్రాణహిత నదిలో మునిగి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి మహారాష్ట్రంలోని తోగులవెంకటాపూర్ క్షేత్రానికి వెళ్లాడు. మొక్కులు చెల్లించిన అనంతరం ఇంటి వద్ద పనిఉందని చెప్పి మధ్యాహ్నం కాలినడకన గ్రామానికి బయలుదేరాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులకు గోవిందరావు కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం ప్రాణహిత తీరంలో శవమై తేలాడు. నది దాటుతున్న క్రమంలో నీట మునిగి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుని భార్య కుసుమాంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

పిల్లర్లు ధ్వంసం చేసిన ఒకరి రిమాండ్

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని గోంది గ్రామ శివారులో రిజర్వు ఫారెస్టు కంపార్ట్‌మెంట్ నెం.68లో అటవీశాఖ సరిహద్దు పిల్లర్లను ధ్వంసం చేసిన ఒకరిని రిమాండ్‌కు తరలించినట్లు కాగజ్‌నగర్ ఫారెస్టు రేంజ్ అధికారి రమాదేవి తెలిపారు. మండలంలోని అంకుసాపూర్ గ్రామానికి చెందిన గొర్రె అర్జున్ నాలుగు పిల్లర్లను ధ్వంసం చేశాడని, అటవీశాఖ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి సిర్పూర్ (టి) న్యాయస్థానంలోప్రవేశపెట్టగా నిందితునికి 11 రోజుల రిమాండ్ విధించినట్లు ఆమె పేర్కొన్నారు.

మంచిర్యాలలో చోరీ


చిందర వందరగా బీరువాలోని బట్టలు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఆర్‌ఆర్‌నగర్‌లో నివాసం ఉంటున్న వార్ల రాజయ్య ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం రాజయ్య రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లాడు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. చోరీ జరిగినట్లు భావించి పోలీసులకు సమాచారం అందించాడు. తులం బంగారు నగలతో పాటు, రూ.40 వేలు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపాడు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించక పోవడం గమనార్హం.

పెరిగిన టోల్ చార్జీలు


వాంకిడి సమీపంలోని సరాండి టోల్‌ప్లాజా

- ఎన్‌హెచ్–363పై పెంపు
- ఆదివారం రాత్రి నుంచి 5 శాతం అధికంగా వసూళ్లు

వాంకిడి: నాలుగు వరుసల జాతీయ రహదారి–363పై టోల్ చార్జీలు పెంచుతూ నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆదివారం ప్రకటన జారీ చేసింది. ఏప్రిల్ 1 నుంచే పెరిగిన చార్జీలు అమలులోకి తీసుకురావాల్సి ఉండగా ఎన్నికల నేపథ్యంలో వాయిదా వేశారు. చివరి విడత ఎన్నికల పోలింగ్ ముగియడంతో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు కొత్త రేట్లు అమలులోకి తీసుకొచ్చారు. మంచిర్యాల జిల్లాలోని శ్రీరాంపూర్ జీఎం ఆఫీసు నుంచి కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని మహారాష్ట్ర సరిహద్దు గోయెగాం వరకు 92 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల జాతీయ రహదారి–363 నిర్మించారు. మంచిర్యాల జిల్లా మందమర్రి వద్ద, కుమురంభీం జిల్లా వాంకిడి మండలంలోని సరాండి వద్ద టోల్ ప్లాజాలు ఏర్పాటు చేశారు. సరాండి టోల్ ప్లాజాను 5 నెలల క్రితం ప్రారంభించగా, మందమర్రి టోల్ ప్లాజాను అంతకు ముందే ప్రారంభించారు. ఈ రెండింటి మధ్య 60 కిలోమీటర్ల దూరం ఉండగా ప్రస్తుతం పెరిగిన చార్జీలతో వాహనదారులపై అధిక భారం పడనుంది. కొత్త రేట్ల ప్రకారం పాత చార్జీలతో పోలిస్తే 5 శాతం పెరిగినట్లు తెలుస్తోంది. 31 మార్చి 2025 వరకు కొత్తచార్జీలు కొనసాగనున్నట్లు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు గెజిట్ విడుదల చేశారు.

పాత రేట్లు(రూ.లలో)			
వాహనాల కేటగిరీ	సింగిల్ జర్నీ	తిరుగు ప్రయాణం	నెలవారీ పాస్
కారు, జీపు, వ్యాన్	75	110	2,475
లైట్ కమర్షియల్	120	180	3,995
గూడ్స్, మినీ బస్			
బస్సు లేదా ట్రక్	250	375	8,370
త్రీ యాక్సిల్స్ వాణిజ్య వాహనాలు	275	410	9,130
నాలుగు నుంచి ఆరు యాక్సిల్స్	395	590	13,125
ఏడు యాక్సిల్స్ అంతకంటే ఎక్కువ	480	720	15,980
(అధిక బరువు గలవి)			
కొత్త రేట్లు (రూ.లలో)			
కారు, జీపు, వ్యాన్	90	135	2,955
లైట్ కమర్షియల్, మినీ బస్	145	215	4,775
బస్, ట్రక్	300	450	10,005
త్రీ యాక్సిల్స్	325	490	10,915
4–6 యాక్సిల్స్	470	705	15,690
ఏడు లేదా అంతకన్నా ఎక్కువ	575	860	19,105

‘కార్యాలయాల నిర్మాణానికి సహకరించాలి’



మాట్లాడుతున్న టీ.శ్రీనివాస్

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని తిలక్‌నగర్, రాజీవ్‌నగర్‌లలో పార్టీ కార్యాలయాల నిర్మాణానికి ప్రజలు సహకరించాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టీ.శ్రీనివాస్ కోరారు. అనేక పోరాటాలు, ఉద్యమాలు త్యాగాలతో కూడిన విప్లవ పార్టీకి జిల్లా కేంద్రంలో కార్యాలయాల నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ప్రజలు, అభిమానులు ఆర్థికంగా, వస్తురూపేణా సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బ్రహ్మానందం, చాంద్‌పాషా, శ్రీనివాస్, మల్లన్న, సాజీద్, సాంబన్న, సోమన్న, గణేశ్, తిరుపతి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో మాయమైన నగలు

కాగజ్‌నగర్ రూరల్: బస్సులో ప్రయాణిస్తున్న మహిళ బంగారు ఆభరణాలు మాయం కావడంతో పట్టణ సోమవారం పోలీసులను ఆశ్రయించింది. సీఐ శంకరయ్య తెలిపిన వివరాల ప్రకారం బెజ్జూర్ మండలం రెబ్బెన కొత్తగూడెం గ్రామానికి చెందిన చిలుక సుజాత బెజ్జూర్ నుంచి అహెరి వెళ్లే బస్సులో కాగజ్‌నగర్ బస్టాండ్‌కు చేరుకుంది. బస్టాండ్‌లో దిగిన తర్వాత తన బ్యాగులో చూడగా, అందులో పెట్టిన బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో ఆందోళనకు గురైంది. తాను కూర్చున్న సీటు వద్ద వెదకగా నగలు లభించలేదు. పోగొట్టుకున్న నగల విలువ రూ.1,18,750 ఉంటుందని బాధితురాలు వాపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని సీఐ తెలిపారు.

అర్లి(టి) వద్ద అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు


రోడ్డుపక్కకు దూసుకెళ్లిన బస్సు

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి) సమీపంలో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి పంటచేలోకి దూసుకెళ్లిన ఘటన చోటు చేసుకుంది. అప్రమత్తమైన డ్రైవర్ బస్సును వెంటనే నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఆదిలాబాద్ బస్టాండ్ నుంచి భీంపూర్ మండలంలోని కరంజి(టి) వైపునకు 32 మంది ప్రయాణికులతో బస్సు బయలుదేరింది. అర్లి(టి), ఇందూర్‌పల్లి గ్రామాల మధ్యలో రోడ్డుపై ఏర్పడిన గుంతను తప్పించే క్రమంలో బస్సు ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. అప్రమత్తమైన డ్రైవర్ బస్సును చాకచాక్యంగా నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు. మరికొంత దూరం వెళ్తే బస్సు బోల్తాపడి ప్రమాదం జరిగే అవకాశం ఉండేది. ట్రాక్టర్ సాయంతో బస్సును బయటకు తీశారు. అంతర్రాష్ట్ర రోడ్డు పూర్తిగా గుంతలుగా మారడంతోనే నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని మండల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు జోక్యం చేసుకుని రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

పాలిసెట్‌లో విద్యార్థుల ప్రతిభ

కాగజ్‌నగర్‌రూరల్: సోమవారం వెలువడిన పాలిసెట్ ఫలితాల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కాగజ్‌నగర్ పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన సిందం సాయిచరణ్ ఇంజనీరింగ్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 29, వ్యవసాయ రంగంలో 9వ ర్యాంకు, సామల నాగప్రణీత ఇంజనీరింగ్ విభాగంలో 714, వ్యవసాయ విభాగంలో 601 ర్యాంకు, షేక్‌ఖాజాబాబా ఇంజనీరింగ్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 748 ర్యాంకు సాధించారు. వాసాల పవన్‌సాయి ఇంజనీరింగ్ విభాగంలో 1467, వ్యవసాయ విభాగంలో 800, సెండె అంజలి ఇంజనీరింగ్‌లో 1,769, బంక వాసు ఇంజనీరింగ్‌లో 2,140, వ్యవసాయ విభాగంలో 827వ ర్యాంకు సాధించారు.

కౌటాల: కౌటాల మండలంలోని బోదంపల్లికి చెందిన పెరుగు దేవాజీ, కవిత దంపతుల కుమారుడు సాయిరాం 51వ ర్యాంక్ సాధించాడు.

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం చంద్రవెల్లికి చెందిన ఇరుసుల సమ్మయ్య–శ్రీలత దంపతుల కుమారుడు జశ్వంత్ ఎంబైపీసీ స్ట్రీమ్ రాష్ట్ర స్థాయిలో 249, ఎంపీసీలో 781 ర్యాంక్ సాధించాడు.

తాంసి: మండల కేంద్రానికి చెందిన జింక మహేందర్, ప్రేమల దంపతుల కుమార్తె జింక పల్లవి రాష్ట్ర స్థాయిలో 569 ర్యాంక్ సాధించింది.

పాలిసెట్‌లో జిల్లాలో మూడో ర్యాంకు

కాసిపేట: మండల కేంద్రానికి చెందిన మల్లెత్తుల రాజేశం–సుజాత దంపతుల కుమారుడు సుమంత్ ఎంబైపీసీలో జిల్లాలో మూడో ర్యాంకు, రాష్ట్రంలో 281వ ర్యాంకు సాధించాడు. ఎంపీసీ విభాగంలో సైతం 582వ ర్యాంకు సాధించాడు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): నంనూర్ గ్రామానికి చెందిన మాటేటి సత్యవతి–రాజయ్య దంపతుల కుమార్తె అర్చన బైపీసీ విభాగంలో 254, ఎంపీసీ విభాగంలో 477 ర్యాంకు సాధించింది.


సిందం సాయిచరణ్


రాచర్ల సంతోషిణి


పెరుగు సాయిరాం


ఇరుసుల జశ్వంత్


జింక పల్లవి


మల్లెత్తుల సుమంత్


మాటేటి అర్చన